సాక్షి నంద్యాల

గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఆదాయం రూ.4.27 కోట్లు

మంత్రాలయం రూరల్: శ్రీమఠం హుండీల్లో కానుకలు లెక్కించగా రూ.4,27,09,103 ఆదాయం వచ్చింది. భక్తులు 29 రోజులుగా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు.



న్యాయం చేయాల్సిందే!

వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ బాధితులు నిరసన కొనసాగించారు. నిందితులను అదుపులోకి తీసుకుని డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 10లో▸



మరో నలుగురికి డెంగీ

వెల్దుర్తి మండలంలో డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. రెండ్రోజుల క్రితం 10 మందికి రాగా బుధవారం మరో నలుగురికి సోకింది. వీరిలో హోంగార్డు ఉన్నాడు. 10లో▸

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి ఐదవ ప్రధానిగా మోదీ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్నను సేవించాలని సామాన్యులు మొదలు ప్రముఖులెందరో పరితపిస్తుంటారు. అతి ప్రాచీన చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న శ్రీగిరిని సందర్శించిన ప్రముఖుల్లో తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, తొలి ప్రధాని నెహ్రూ వంటి వారు ఉన్నారు. ఈ నెల 16న భారత ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తున్నారు. ప్రధాన మంత్రి హోదాలో జవహర్‌లాల్‌నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి హోదాలో నలుగురు దర్శించుకోగా ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ దర్శించుకుంటే ఐదవ ప్రధానిగా రికార్డులో నమోదవుతారు. పలువురు రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, దేశంలోని ప్రముఖ మఠాల పీఠాధిపతులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

కర్నూలు(అగ్రికల్చర్): దేశ ప్రధాని పర్యటన నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగుల సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లపై మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు చర్చలు జరిగాయి. అయితే ఎలాంటి పరిష్కారం లభించలేదు. అయితే రాష్ట్రంలో ప్రధాని పర్యటిస్తున్నందున సమ్మెను వాయిదా వేసుకోవాలని విద్యుత్ సంస్థల మేనేజ్‌మెంట్లు కోరడంతో అంగీకరించారు. తాత్కాలికంగా సమ్మె వాయిదా పడిందని పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 17న చర్చలు ఉన్నాయని, చర్చలు విఫలమైతే ఆ రోజున సమ్మెపై నిర్ణయం ఉంటుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓలుగా 42 మందికి పదోన్నతి

- 19 మంది మాత్రమే అంగీకార పత్రాల అందజేత

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 42 మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. సీనియారిటీ ప్రకారం ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించనున్నారు. ఈ నెల 14న జారీ చేసిన ఆదేశాల మేరకు బుధవారం పదోన్నతుల జాబితాలో ఉన్న సీనియర్ అసిస్టెంట్లు తమ సర్వీస్ రిజిస్టర్లతో స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో హాజరయ్యారు. వీరి నుంచి స్పెషల్ అసెస్‌మెంట్ రిపోర్టు, విల్లింగ్ రిపోర్టులను తీసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతి పొందే జాబితాలో 42 మంది సీనియర్ అసిస్టెంట్లు ఉండగా, కేవలం 19 మంది మాత్రమే పదోన్నతి తీసుకునేందుకు అంగీకార పత్రాలను అందించినట్లు సమాచారం. మిగిలిన 23 మంది వయస్సు, అనారోగ్యం, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందనే భావనతో అయిష్టతను వ్యక్తం చేసినట్లు తెలిసింది.

‘నమో’మయం

- నేడు కర్నూలు, శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మొదటిసారి శ్రీశైలం మల్లన్నను దర్శించుకోనున్న ప్రధాని
- కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ సభలో పాల్గొననున్న పీఎం
- అక్కడే రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- కర్నూలులో 750 ఎకరాల్లో 3 లక్షల మందితో బహిరంగ సభ
- 11 పార్కింగ్ ప్రదేశాలు, మూడు తాత్కాలిక ఆసుపత్రులు, ఐదు హెలిప్యాడ్‌ల ఏర్పాటు



కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, శ్రీశైలం పర్యటనకు సర్వం సిద్ధమైంది. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓర్వకల్లు మండలం నన్నూరులో జరిగే సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ కోసం రాగమయూరి హిల్స్‌లో 750 ఎకరాలు సిద్ధం అయ్యింది. కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి నేతృత్వంలో రెండు వారాలపాటు అధికారులు శ్రమించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పార్కింగ్, భోజనాలు, వైద్య సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రధాని హోదాలో మొదటి సారి మోదీ శ్రీశైలం మల్లికార్జున, భ్రమరాంబదేవిలను దర్శించుకోనున్నారు. ఈ క్రమంలో దేవాలయ అధికారులు, నంద్యాల జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకున్నారు.

ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడలకు శంకుస్థాపనలు

ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రూ.13,430 కోట్లకు సంబంధించి జాతీయ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందులో అత్యంత కీలకమైన ఓర్వకల్లు(కర్నూలు), కొప్పర్తి (వైఎస్‌ఆర్ కడప)లలో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడకలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడలకు ఒక్కో దానికి రూ.2,600 కోట్లను మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు జరిగితే ఆయా ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు ఊపొస్తుందని భావిస్తున్నారు. మరోవైపు కర్నూలు-3 పూలింగ్ స్టేషన్‌లో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ బలోపేతం కోసం కూడా మోదీ శంకుస్థాపన చేస్తారు. వీటితోపాటు సబ్బవరం-షీలానగర్ అరులేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వే లైన్, పెందుర్తి-సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ తదితర ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. శ్రీకాకుళం-అంగుల్ సహజవాయువు పైప్‌లైన్, చిత్తూరులో నిర్మించిన ఇండియన్ ఆయిల్ బాట్లింగ ప్లాంట్, కృష్ణా జిల్లా నిమ్మకూరు వద్ద స్థాపించిన భారత్ ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలను వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు.

ప్రధాని పర్యటన సాగుతుంది ఇలా..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, శ్రీశైలం పర్యటన వివరాలను పీఎంఓ వెల్లడించింది.

- ఐఏఎఫ్ ఎంబ్రార్ విమానంలో 16వ తేదీ ఉదయం 10.20 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ప్రధాని చేరుకుంటారు.
- ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి ఎంఐ-17 హెలికాప్టర్ ద్వారా ఉదయం 10.25 గంటలకు బయలు దేరి సున్నిపెంట హెలిప్యాడ్‌కు 11.05 గంటలకు చేరుకుంటారు.
- భ్రమరాంబ గెస్టు హౌస్‌కు 11.25 గంటలకు వెళ్తారు. అక్కడ 11.30 నుంచి 11.40 గంటలమధ్య కాసేపు విశ్రాంతి తీసుకుంటారు.
- భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఆలయాలనికి 11.45 గంటలకు చేరుకుంటారు.
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకొని దర్శనం చేసుకుంటారు.
- భ్రమరాంబ గెస్టు హౌస్ చేరుకొని మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుకుంటారు.
- సున్నిపెంట నుంచి 1.35 నుంచి బయలుదేరి 2.20 గంటలకు కర్నూలులోని రాగమయూరి గ్రీన్ హిల్స్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- సభావేదికకు 2.30 గంటలకు చేరుకుని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రసంగం చేస్తారు.
- అనంతరం 4.40 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకొని 4.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.



బహిరంగ సభ ప్రధాన వేదిక



శ్రీశైల ఆలయ వీధి వద్ద ఏర్పాట్లు

హెలిప్యాడ్‌లు, పార్కింగ్ ప్రదేశాలు


పీఎం సభా ఏర్పాట్లలో కీలకమైన హెలిప్యాడ్‌లు, పార్కింగ్ ప్రదేశాలను అధికారులు పూర్తి చేశారు. ప్రధానమంత్రి కోసం మూడు హెలిప్యాడ్‌లు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కోసం మరో రెండు హెలిప్యాడ్‌లను నిర్మించారు. అంతేకాక వాటికి అనుసంధానంగా బీటీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. మరోవైపు పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తం 11 చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసి వాహనాలను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాక సభకు వచ్చే వాహనదారులకు ఇబ్బంది పడకుండా 20 చోట్లా సైట్ మ్యాపులు, 1300 సూచిక బోర్డులు, 11 చోట్లహెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. అంతేకాక 2072 వీధి దీపాలను ఏర్పాటు చేసి 19 జనరేటర్లను అందుబాటులోకి తెచ్చారు.

కర్నూలులో తిష్టవేసిన మంత్రులు, ఉన్నతాధికారులు

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటుండడంతో మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కర్నూలులో తిష్టవేసి కూర్చున్నారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, నారాయణ, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాదు, అనగాని సత్యప్రసాదు, గొట్టిపాటి రవికుమార్, హోంమంత్రి ఏర్పాట్లను పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగానికి సలహాలు, సూచనలు చేశారు. మరోవైపు ప్రధాని సభకు సంబంధించిన ఏర్పాట్లను 35 మంది ఐఏఎస్ అధికారులు, 200 మంది రాష్ట్రస్థాయి అధికారులు, 19 మంది డిప్యూటీ కలెక్టర్లు, 35 మంది తహసీల్దార్లుతోపాటు దాదాపు 5 వేల మంది సిబ్బంది రేయింబవళ్లు నిమగ్నమై పనులను పూర్తి చేశారు. భద్రతా పరమైన ఏర్పాట్ల కోసం ఎస్పీజీ అదనపు డీజీ సురేష్‌కుమార్, ఏపీ డీజీపీతోపాటు 37 మంది ఐపీఎస్ అధికారులతో సహా 8 వేల మంది అధికారులు విధుల్లో చేరారు. అంతేకాక 18 మంది వివిధ ప్రాంతాల్లో పనిచేసే మునిసిపల్ అధికారులు కూడా పీఎం సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



ప్రజల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు



బహిరంగ సభ ప్రాంగణం



బందోబస్తుకు వచ్చిన పోలీసులు

వైద్య సదుపాయాలకు ప్రాధాన్యం

పీఎం సభకు వచ్చే వారి ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా ఏర్పాట్లు జరిగాయి. వీవీఐపీల కోసం ఐదు పడకల ఆసుపత్రి, వీఐపీల కోసం 10 పడకల రెండు ఆసుపత్రులు, ప్రజల కోసం 20 పడకల తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో 104 వాహనాలు 30, 108 అంబులెన్స్‌లు 33 ఉండేలా ఉంచనున్నారు. మూడు వైద్య శిబిరాలను కూడా వైద్య,ఆ రోగ్య శాఖ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

పెద్ద ఎత్తున జనసమీకరణ

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరయ్యే సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జన సమీకరణపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మెప్మా, డీఆర్‌డీఏల పరిధిలో పనిచేసే పొదు సంఘాల సభ్యులు, లీడర్లను ఖరాఖండిగా తీసుకొచ్చేలా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. మొత్తం 3 లక్షల మంది సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటుండడంతో వారికి భోజన సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. పక్కన ఉన్న అనంతపురం, మహబూబ్‌నగర్, కడప జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున కూటమి పార్టీల నేతలు ప్రధాని సభకు జన సమీకరణకు చర్యలు తీసుకుంటున్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

- పోలీసు అధికారులకు డీజీపీ ఆదేశం

కర్నూలు: ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధుల్లో ఉండే పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో అడిషనల్ డీజీ ఎస్. మధుసూదన్ రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్య ఏసుబాబు, ఫక్కీరప్ప కాగినెల్లిలతో కలసి పీఎం భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. మినిట్ టు మినిట్ ప్రోగ్రాం, రూట్ మ్యాప్, రాగమయూరి బహిరంగ సభ తదితర ప్రాంతాలను గూగుల్ జియో మ్యాప్‌ను తెరపై చూపిస్తూ డీజీపీకి ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరించారు. భద్రత చర్యలపై చర్చించారు.



భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బహిరంగ సభకు ఎక్కడినుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయనే విషయంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బహిరంగ సభ వద్ద మఫ్టీ పోలీసులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీవీఐపీలు వెళ్లిపోయేవరకు ఎక్కడ కూడా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. డీఐజీలు, ఎస్పీలు, ట్రైనీ ఐపీఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు సమావేశంలో పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

శ్రీశైలంటెంపుల్: ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా శ్రీశైలం వస్తున్న నేపథ్యంలో 1,800 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీశైలంలో ప్రత్యేక పూజల అనంతరం జగద్గురు పీఠాన్ని ప్రధానమంత్రి సందర్శిస్తారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని, ధ్యాన మందిరాన్ని సందర్శించి సున్నిపెంటకు వెళ్తారు. ప్రధాని శ్రీశైలం పర్యటనను పురస్కరించుకుని పోలీసులు బుధవారం ట్రయల్‌రన్ నిర్వహించారు.

నేతల ఆదేశం.. పోలీసుల గులాం!

‘సాక్షి’ పత్రికపై, జర్నలిస్టులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని జాతీయ స్థాయిలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎడిటర్స్ గిల్డ్ తీవ్రంగా తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కర్నూలులో నమోదు చేసిన కేసు ‘మంత్రి టీజీ భరత్ ప్రోద్బలంతోనే’ అని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.



- వివరాలు 10లో

డీఆర్‌డీఏ పీడీ బదిలీ ఉత్తర్వులు నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ వైపి రమణారెడ్డి బదిలీ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్‌లో డీఎల్‌డీవో అయిన ఈయన డిప్యూటేషన్‌పై డీఆర్‌డీఏ పీడీగా పని చేస్తున్నారు. ఈయనను సెప్టెంబర్ నెల మొదటి వారంలో వైఎస్‌ఆర్ కడప జిల్లా నీటియాజమాన్య సంస్థ పులివెందుల అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సెప్టెంబర్ నెల 9న అప్పటి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఇక్కడే డీఆర్‌డీఏ పీడీగా కొనసాగించాలని డీవో లెటర్ రాశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం బదిలీని నిలుపుదల చేస్తూ కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్నారు!

- వామపక్ష నాయకుల ఆందోళన

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర అభివృద్ధి పేరుతో కూటమి నేతలు విపరీత అప్పులు చేస్తున్నారని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. ఎలాంటి అభివృద్ధి లేకున్నా వేల కోట్ల రూపాయలు అప్పులు ఎలా తీసుకువస్తారని ప్రశ్నించారు. నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చి నుంచి గాంధీచౌక్ వరకు సీపీఐ, సీపీఎం న్యూడెమోక్రసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ‘మోదీ గో బ్యాక్’ అని నినాదాలు చేశారు. అనంతరం గాంధీచౌక్‌లో జరిగిన నిరసనలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా నిరసన చేస్తున్న వామపక్ష నాయకుల అక్రమ అరెస్టులకు పాల్పడటం శోచనీయమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. సిద్దేశ్వరం అలుగు పూర్తి చేయాలని, శ్రీశైలానికి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ తగ్గిస్తున్నామంటూ సభలను నిర్వహించడం ప్రజలను పక్కదారి పట్టించడమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమన్న, డి శ్రీనివాసులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

క్లుప్తంగా

సబ్సిడీ విత్తనాలకు డిమాండ్ కరువు

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆలస్యంగా చేపట్టడంతో డిమాండ్ తగ్గింది. ఈ నెల 10 నుంచి విత్తన పంపిణీ మొదలైంది. అప్పటికే ఆలస్యం కావడంతో రైతులు ప్రత్యామ్నాయంగా విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్) విత్తన సరఫరా చేస్తోంది. రబీ సీజన్‌కు 36,461 క్వింటాళ్లు కేటాయించగా.. ఏపీసీడ్స్‌లో విత్తనోత్పత్తి చేయించిన 10వేల క్వింటాళ్లు మాత్రమే ఉంది. దీనినే ఏపీసీడ్స్ అధికారులు ప్రాసెసింగ్ చేసి రైతు సేవా కేంద్రాలకు తరలించారు. స్థానికంగా ప్రయివేటు విత్తన కంపెనీలు కూడా శనగ విత్తనాలు ఉత్పత్తి చేయించి సేకరించి పెట్టుకున్నాయి. అయితే గత బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీసీడ్స్‌కు సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో విత్తన కొరత ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఏపీసీడ్స్ అధికారులు గుంటూరు, ప్రకారం జిల్లాల నుంచి శనగ విత్తనాలు తెప్పించి రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


మీటు నాయక్(ఫైల్)

అవుకు(కొలిమిగుండ్ల): పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. ఇస్రానాయక్ తండాకు చెందిన రైతు మీటునాయక్(55) అవుకులో పంటల కోసం ఎరువులు కొనుగోలు చేసి ఆటోలో వేసుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యలో వర్షం రావడంతో ఆటోను పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఎరువులు తడవకుండా ప్లాస్టిక్ పట్ట కప్పేందుకు యత్నిస్తుండగా అదే సమయంలో బనగానపల్లె నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో మీటు నాయక్ రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో 108 వాహన సిబ్బంది అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

స్కూల్ బస్సు కింద పడి చిన్నారికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ: మండలంలోని కొండంపల్లె గ్రామంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడి ఆరేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి ప్రైవేటు పాఠశాల బస్సును ప్రధాన మంత్రి సమావేశానికి ప్రజలను తరలించేందుకు అధికారులు కేటాయించారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం ప్రజలను తీసుకెళ్లేందుకుని వేగంగా వెళ్తూ కొండంపల్లె గ్రామంలో రోడ్డు సైడు ఆడుకుంటున్న జీనిత్‌ను ఢీకొంది. ప్రమాదంలో చిన్నారి కాలు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు వెంటనే నంద్యాల వైద్యశాలకు తరలించారు. మూడేళ్ల క్రితం జీనిత్ తండ్రి దస్తగిరి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

మరో నలుగురికి డెంగీ

వెల్దుర్తి: మండలంలో డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. రెండ్రోజుల క్రితం 10 మందికి డెంగీ నిర్ధారణ కాగా తాజాగా బుధవారం మరో నలుగురికి డెంగీ సోకింది. పట్టణానికి చెందిన హోంగార్డు షాకీర్ బాషా స్థానిక స్టేషన్‌లోనే విధులు నిర్వహిస్తున్నాడు. అతని కుమారుడు రెండ్రోజుల క్రితం డెంగీ లక్షణాలతో సీహెచ్‌సీలో చికిత్స పొందుతుండగా, తాజాగా హోంగార్డుకు సైతం డెంగీ లక్షణాలు తేలడంతో చికిత్స పొందుతున్నాడు. మదార్‌పురం మహేంద్ర, మరో ఇద్దరు సైతం అదే ఆసుపత్రిలో డెంగీ లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని 14, 15వ వార్డులలో డెంగీ జ్వర కేసులు పెరిగిపోతుండడం గమనార్హం.

నేతల ఆదేశం.. పోలీసుల గులాం!

'సాక్షి'పై అక్రమ కేసుల పరంపర

- కూటమి ప్రభుత్వంలో నాలుగు అక్రమ కేసులు
- త్రీటౌన్‌లో 2, టూటౌన్‌లో ఒకటి, ఉలిందకొండలో మరో కేసు నమోదు
- 'సాక్షి' యాజమాన్యం, పబ్లిషర్, బ్యూరోపై కేసు నమోదు చేసిన కర్నూలు పోలీసులు
- మంత్రి టీజీ భరత్‌కు వ్యతిరేకంగా వార్త రాశామని రెండు స్టేషన్లలో కేసు నమోదు
- డీఐజీపై వార్తలు రాశారని మరో రెండు కేసులు



సాక్షి ప్రతినిధి కర్నూలు: 'ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడినా ఎవరూ ప్రశ్నించకూడదు. అలాచేస్తే అక్రమ కేసులు నమోదు చేసి, భయభ్రాంతులకు గురిచేసి మీడియాను లొంగదీసుకునే చర్యలను కూటమి ప్రభుత్వం అవలంబిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'సాక్షి'పై అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో కర్నూలులో ఈ 15 నెలల్లో నాలుగు అక్రమ కేసులు నమోదు చేయడం గమనార్హం. గత నెల 13న 'సాక్షి'లో 'క్యాంపు భరతం పట్టేస్తా!' శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. కర్నూలులోని బీ, సీ క్యాంపు స్థలాల్లో మినీ క్రికెట్ స్టేడియం నిర్మించి ఆ ముసుగులో ఇద్దరు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు స్థలాలను లీజు పేరిట కొట్టేయడానికి కుట్ర పన్నుతున్నారనేది ఆ వార్త సారాంశం. కథనంపై బి.నవీన్‌కుమార్ అనే వ్యక్తి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో 'సాక్షి'పై ఫిర్యాదు చేశారు. 'సాక్షి'లో కథనం చదివి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు బీ, సీ క్యాంపులో సమావేశమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా చర్చించుకుంటున్నారని, వీరంతా నక్సలైట్లుగా మారే అవకాశం ఉందని, మంత్రి టీజీ భరత్‌కు నష్టం చేకూర్చేలా కథనం రాశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో సాక్షి మేనేజ్‌మెంట్, సాక్షి పబ్లిషర్‌పై క్రైం నెంబర్ 419/20225 కింద సెక్షన్ యూ/ఎస్192, 352,353 (1),(బి),356(1),61(1) (ఏ) రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. అలాగే రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో సెక్షన్ 192, 356(1),352,353(1)(బి)61(1)(ఏ)రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్‌పై మరో కేసు నమోదు చేశారు. నవీన్ కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌లో, శరత్‌బాబు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో కేసులు నమోదయ్యాయి.

జాతీయ స్థాయిలో తప్పుపట్టినా మారని వైఖరి

'సాక్షి' పత్రికపై, జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ంగా కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నేతలు, జర్నలిస్టు యూనియన్లతో పాటు జాతీ య స్థాయిలో ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎడిటర్స్ గిల్డ్ కూడా తీవ్రంగా తప్పుపట్టింది. హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించింది. అయినప్పటికీ కూటమి పార్టీలు ఎలా చెబితే అలా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. కర్నూలులో నమోదు చేసిన కేసు కూడా మంత్రి టీజీ భరత్ ప్రోద్బలంతోనే నమోదైనట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జూలై 26, 2025

కర్నూలు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో 'సాక్షి'పై సెక్షన్ 132, 308(3), 353(1)(బి), 356(3), రెడ్‌విత్ 61(2)బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. డీఐజీ సీసీ రత్నప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 'రాయలసీమలో అనకొండ ఐపీఎస్' పేరుతో ప్రచురితమైన కథనం నేపథ్యంలో ఆ కేసు నమోదు చేశారు. ఏ1–గా సాక్షి బ్యూరో, ఏ2గా సాక్షి మేనేజ్‌మెంట్, పబ్లిషర్ పేరును చేర్చారు. కథనంలో ఎక్కడా కర్నూలు డీఐజీ అని కానీ, డీఐజీ పేరు కానీ రాయలేదు. పైగా సీసీ రత్నప్రకాశ్ ఈ కథనంతో ఎలా బాధితుడు అవుతారు? అతని ఫిర్యాదు మేరకు కేసు ఎలా నమోదు చేస్తారని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు.

డిసెంబర్ 22, 2024

కర్నూలులో మునీర్ అహ్మద్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు కిడ్నాప్ చేశారు. తన భూమిని మరొకరికి కట్టబెట్టాలని పోలీసులు బెదిరిస్తున్నారని, తాను పని చేస్తున్న స్కూలుకు పోలీసులు వచ్చి కిడ్నాప్ చేశారని, డీఐజీ కోయ ప్రవీణ్ సూచనలతోనే వ్యవహారం జరిగిందని, పలుమార్లు డీఐజీ పిలిపించి కోర్టులతో పని లేదు, సెటిల్ చేసుకోవాలని చెప్పారని విలేకరులకు చెప్పారు. ఇదే విషయాన్ని ప్రముఖ ఛానెళ్లు, పత్రికలు ప్రచురించాయి. కానీ అప్పుడు కూడా 'సాక్షి'పై మాత్రమే కేసు నమోదు చేశారు. కిడ్నాప్ వ్యవహారంపై 'సాక్షి' కథనం రాస్తే త్రీటౌన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తన విధులకు సాక్షి విలేకరి ఆటంకం కలిగించారని తప్పుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడం గమనార్హం.

సాక్షి కార్యాలయంలో సోదాలు సరికాదు



హైదారాబాద్ సాక్షి కార్యాలయంలో పోలీసుల సోదాలు సరికాదు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. ఏదైనా వార్తపై అనుమానం ఉంటే న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందవచ్చు. అయితే కొందరు పోలీసులు అవేమి పట్టకుండా నేరుగా జర్నలిస్టులపై కేసులుపెట్టడం అన్యాయం. సాక్షి ఎడిటర్‌కు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన నెల్లూరు పోలీసులు ఆ పని చూసుకోవాలే కానీ అక్కడి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం.

– ఈఎస్ రాజు, ఏపీయూడబ్ల్యూజే, జిల్లా అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది



కూటమి ప్రభుత్వం సాక్షిపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. చిన్న వార్త రాసినా జీర్ణించుకోలేక కేసులు పెట్టిస్తోంది. హైదరాబాద్ సాక్షి కార్యాలయంలో పోలీసులు సోదాలు నిర్వహించి సిబ్బంది ని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించ డం సరికాదు. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. పోలీసుల తీరు పత్రికా స్వేచ్ఛను హరించేలా ఉంది. వెంటనే సాక్షి ఎడిటర్‌కు ఇచ్చిన నోటీసులను వెనక్కు తీసుకోవాలి.

– కె.శ్రీనివాసులు, రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

న్యాయం జరిగేంత వరకు కదలం


బాధితుల కష్టాలు ఎమ్మెల్యే అఖిలప్రియకు వివరిస్తున్న జెడ్పీటీసీ

- ఎమ్మెల్యే అఖిల ప్రియకు తేల్చి చెప్పిన బాధితులు

దొర్నిపాడు: స్థానిక ప్రధాన రహదారిపై రెండో రోజు బుధవారం వందలాది మంది వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ బాధితులు నిరసన కొనసాగించారు. రాజారెడ్డి, వీరారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డిలను వెంటనే అదుపులోకి తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు.

ఎమ్మెల్యే హామీ ఇచ్చినా..

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ దొర్నిపాడుకు చేరుకుని బాధితుల నుంచి జరిగిన విషయం తెలుసుకున్నారు. రావాల్సిన డబ్బు తప్పకుండా ఇప్పిస్తామని నిరసన విరమించాలని కోరారు. కాగా డబ్బులిచ్చిన తర్వాతే నిరసన విరమిస్తామని, అంతరకు కదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే వెనుదిరిగారు. కాగా ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శకుంతల బాధితులకు సంఘీభావం ప్రకటించారు.

గిట్టుబాటు ధర లేదు, పైసా నిధులివ్వరు!


కర్నూలులో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

- వామపక్షాల ఆధ్వర్యంలో మోదీ గోబ్యాక్

కర్నూలు(సెంట్రల్): రైతులు పండించిన ఉల్లి, టమాటాలకు గిట్టుబాటు ధర కల్పించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకని.. పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులకు పైసా నిధులు ఇవ్వని మోదీకి కర్నూలులో పర్యటించే అర్హత ఉందా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ప్రశ్నించారు. వామపక్షాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటనను నిరసిస్తూ కర్నూలులో మోదీ గోబ్యాక్ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అంతటా అన్ని నియోజకవర్గాల్లో చేపట్టిన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు నల్లదస్తులు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కర్నూలులో జరిగిన కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, పి.రామచంద్రయ్య మాట్లాడుతూ ఏపీకి విభజన హామీల అమలు, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆ పదవులు ఎందుకని ప్రశ్నించారు. ఏపీ ఎంపీలతో ప్రధానమంత్రిగా ఉన్న మోదీకి.. ఏపీకి ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వరని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు ప్రశ్నించడంలేదన్నారు. మరోవైపు నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గకున్నా సంబరాలు ఎందుకన్నారు. కేవలం బీమా కంపెనీలకు మేలు చేసేలా మాత్రమే జీఎస్టీ సంస్కరణలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.గిడ్డయ్య, డి.గౌస్‌దేశాయ్, నాయకులు పి.నిర్మల, మునెప్ప, లెనిన్‌బాబు, పీఎస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళ మృతి

- అంతిమ సంస్కారం చేసేవారు కరువు


రాజమ్మ మృతదేహం

ఆత్మకూరురూరల్: మూడేళ్ల క్రితం కుట్టు మిషన్‌తో వచ్చి నల్లకాల్వగ్రామంలోని ఎస్సీ కాలనీలో జీవనం సాగిస్తున్న ఒంటరి మహిళ రాజమ్మ(65) మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో శిథిలావస్తులో ఉన్న ఓ గృహంలో ఉంటూ పాత చీరలతో బొంతలు కుడుతూ జీవనం సాగించేది. ఎప్పుడు కూడా తనది ఏ గ్రామమో, తన వారు ఉన్నారో లేదో ఎవరికీ చెప్పని రాజమ్మ రెండు రోజుల నుంచి నుంచి బయటికి రాలేదు. బుధవారం గుడిసె నుంచి దుర్గంధం వ్యాపించడంతో స్థానికులు వెళ్లి చూడగా మృతిచెంది ఉండటంతో సచివాలయ మహిళా కానిస్టేబుల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆత్మకూరు పోలీసులకు సమాచారం చేరవేయగా స్టేషన్‌లో సిబ్బంది మొత్తం ప్రధాని బందోబస్తు నిమిత్తం శ్రీశైలం వెళ్లారని సమాధానం వచ్చింది. సర్పంచ్, గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు సైతం అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తులు ఏం చేయాలో తెలియక పాలుపోని స్థితిలో ఉన్నారు. తామే అంతిమ సంస్కారం చేస్తే పోలీసుల నుంచి ఏదైనా సమస్య వచ్చే అవకాశం ఉందని భయపడి మిన్నకుండిపోయారు. గురువారం వరకు వేచి ఉండి అధికారుల వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోతే.. అప్పుడు తామే అంత్యక్రియలు చేద్దామని గ్రామస్తులు మాట్లాడుకున్నట్లు సమాచారం.

పస్తులుండలేక పయనం!


బొలెరో వాహనంలో తెలంగాణకు బయలుదేరుతున్న యాటకల్లు వాసులు

ఆస్పరి: పశ్చిమ ప్రాంతం వలస బాట పట్టింది. ఉన్న ఊళ్లో పనుల్లేక ప్రజలు పట్టణాలకు పయనమవుతున్నారు. ఖరీఫ్ పనులు ముగియడం.. పంటలు అంతంతమాత్రమే రావడంతో జీవనం గడవడం పిల్లాపాపలతో వలస వెళ్తున్నారు. బుధవారం యాటకల్లు గ్రామానికి చెందిన 12 కుటుంబాలు మూటాముల్లె సర్దుకుని బొలెరో వాహనంలో తెలంగాణలోని పత్తి కోత పనులకు బయలుదేరి వెళ్లారు.

జరిమానా విధిస్తాం.. జాబ్‌కార్డు తొలగిస్తాం!

పొదుపు మహిళలకు బెదిరింపులు

- ఉపాధి కూలీలకూ తప్పని వేధింపులు
- ప్రధాని సభ విజయవంతానికి కూటమి హెచ్చరికలు
- రంగంలోకి డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు

➡ ప్రధాని సభకు వచ్చిన వారినే స్వయం సహాయక సంఘాల్లో కొనసాగిస్తాం. వారికే బ్యాంకుల నుంచి లోన్‌లు, ఇతరత్రా ప్రభుత్వ ప్రయోజనాలను వర్తింపజేస్తాం. సభ్యులు సభకు రాకపోతే ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధిస్తాం. సభ్యులను తరలించడంలో లీడర్లు విఫలమైతే వారిపైనా చర్యలు తప్పవు. ఒక్కో లీడరు నుంచి సభ్యురాలికి రూ.200 చొప్పున జరిమానా వసూలు చేస్తాం.

➡ ఇవీ గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాల మహిళలకు డీఆర్‌డీఏ,మెప్మా సిబ్బంది బెదిరింపులు.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి బహిరంగసభను విజయవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతోంది. డజన్ మంది మంత్రులు, 20 మందికిపైగా ఐఏఎస్ అధికారులు బహిరంగసభ ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ప్రధానంగా జనసమీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. మహిళలను తరలించే బాధ్యత డీఆర్‌డీఏ, మెప్మా అధికారులకు, ఉపాధి కూలీలను తరలించే బాధ్యత జిల్లా నీటియాజమాన్య సంస్థకు, రైతులను తరలించే బాధ్యత వ్యవసాయ శాఖకు అప్పగించారు. మొత్తంగా 3 లక్షల మంది బహిరంగ సభకు హాజరయ్యే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వంపై మహిళలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తయినప్పటికీ మహిళల సంక్షేమానికి ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా చేపట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు హాజరయ్యేందుకు 75 శాతం మంది మహిళలు ససేమిరా అంటున్నారు. అయితే డీఆర్‌డీఏ ఏపీఎంలు, సీసీలు, బుక్ కీపర్లు మహిళలపై బెదిరింపులకు దిగుతున్నారు. సంఘాల్లో ఉండాలంటే చచ్చినట్లు రావాల్సిందేనని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

జాబ్‌కార్డు రద్దు చేస్తాం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభకు వచ్చిన వారికే ఉపాధి పనులు కల్పిస్తామని, లేకపోతే జాబ్‌కార్డులను రద్దు చేస్తామంటూ పలువురు ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల మెడపై కత్తి పెట్టారు. ప్రతి 50 మందికి ఒక బస్సు పెడుతామని, రాకపోతే జాబ్ కార్డులు రద్దవుతాయని బెదిరిస్తుండటంతో ఉపాధి కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కప్పట్రాళ్ల గ్రామంలో విదేశీయుల పర్యటన


కప్పట్రాళ్ల గ్రామస్తులతో ఎన్ఐఆర్‌డీ యంగ్ ప్రొఫెషనల్స్, ఆఫ్రికా దేశీయులు

దేవనకొండ: మండల పరిధిలోని ఐజీ ఆకె రవికృష్ణ దత్తత గ్రామం కప్పట్రాళ్లలో బుధవారం ఆఫ్రికా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 8 మంది ఎన్ఐఆర్‌డీ యంగ్ ప్రొఫెషనల్స్ పర్యటించారు. మూడు రోజులుగా గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొదుపు మహిళా సంఘాలు, రైతులు, విద్యార్థులతో చర్చించి ఐజీ ఆకె రవికృష్ణ చేసిన గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆఫ్రికా దేశ ప్రతినిధి షైనీలూమ్ మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మార్పు కనిపిస్తోందన్నారు. పొదుపు సంఘాల మహిళలు స్వశక్తితో ఎదుగుతున్నారన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారని, విద్యార్థులు చదువులో ప్రగతి సాధిస్తున్నారన్నారు. గ్రామానికి కావాల్సిన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కప్పట్రాళ్ల మార్పు దేశానికే ఆదర్శమన్నారు. గ్రామంలో స్త్రీ శక్తి భవన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళ్యాణ మండపం, మినరల్ వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ సెంటర్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఐజీ ఆకె రవికృష్ణ వర్చువల్‌గా యంగ్ ప్రొఫెషనల్స్‌తో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్షితిష్ రాజ్ (బిహార్), హర్షిక్ కన్నా(మధ్యప్రదేశ్), తుషార్ కౌశిక్(ఉత్తరప్రదేశ్), సౌరబ్‌పాటిల్ (మహారాష్ట్ర), సంపత్‌కుమార్(తెలంగాణ), సుమన్‌చౌహాన్(తెలంగాణ), సతీష్‌కుమార్(ఆంధ్రప్రదేశ్), గ్రామ జ్యోతి మేనేజర్ బి.నారాయణ, సిబ్బంది సుధాకర్, సరిత, రాజేశ్వరి, ఫర్జానా పాల్గొన్నారు.


కిసాన్‌ఘాట్ వద్ద భారీ సంఖ్యలో ఏర్పాటు చేసిన వంట పొయ్యిలు

పే...ద్ద వంటశాల!

పండగో..పబ్బమో..పెళ్లో..పేరంటమో చేయాలంటే వచ్చిన అతిథులకు భోజనాలు చేసి పెట్టేలోపు తలప్రాణం తోకకొస్తుంది. ప్రముఖుల ఇళ్లలో జరిగే శుభకార్యాలకైతే 5 వేల నుంచి 50 వేల మంది వరకు భోజనాలు వండాలంటే వంట శాల తప్పనిసరి. మరి దేశ ప్రధాని తొలిసారి వస్తున్నాడంటే ఆయనకు భారీగా స్వాగతం పలికేందుకు లక్షలాది మందిని సమకూర్చుతున్నారు. వారందరికీ భోజనాలు వండాలంటే పే..ద్ద వంట శాల కావా లిగా.. ఇదో ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలు అవే. మోదీ సభకు హాజరయ్యే అతిథులకు, సందర్శకులకు,ప్రజలకురుచికరమైన భోజనాన్ని అందించేందుకు కర్నూ లు నగరంలోని కిసాన్‌ఘాట్‌ను వంటశాలగా మార్చేశారు. అటు వెళ్లే దారిని బ్లాక్ చేసి బుధవారం నుంచే వంటల తయారీకి సిబ్బంది నడుంబిగించారు. రోడ్డుకు ఇరువైపులా వందకు పైగా పొయ్యిలు వెలిగించి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. రుచికరమైన భోజనాన్ని అందించేందుకు వందలాది మంది వంట సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. మొదట సారి ఇంత పెద్ద వంటశాలను చూసి నగరవాసులు ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


వండిన భోజనాన్ని భారీ ప్లేట్లలో ఆరబెట్టిన దృశ్యం


ఆనియన్ పకోడిని తయారు చేస్తున్న దృశ్యం


సిద్ధంగా ఉన్న వాటర్ బాటిళ్లు


పకోడీలను ప్యాక్ చేస్తున్న దృశ్యం